
సాక్షి పల్నాడు
బుధవారం, 4, అక్టోబర్, 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ నీటి మట్టం మంగళవారం 525.10 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 23,422 క్యూసెక్కులు వదిలారు.



ఎదిగే కొద్దీ ఒదిగి ఉండాలి

మచిలీపట్నం: వైద్య విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. బందరు ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు వైట్ కోట్ కార్యక్రమం నిర్వహించారు.

అమరేశ్వరుని సేవలో రాష్ట్రమంత్రి ఉషాశ్రీచరణ్



అమరావతి: అమరేశ్వరస్వామివారిని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషా శ్రీచరణ్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. స్వామి వారికి, బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చదువుల జాతెర

సర్కారు బడుల్లో డిజిటల్ కాంతులు ఇంద్రధనుస్సులై శోభిల్లుతున్నాయి. తరగతి గదుల్లో చదువుల జాతరకు తెరతీస్తున్నాయి. బంగారు భవితకు బాటలు వేస్తున్నాయి. 'విద్యయా'భవ అంటూ దీవిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల కనుల్లో మెరుపులు మిరుమిట్లుగొల్పుతున్నాయి.

డిజిటల్ విప్లవం
- బోధనకు స్మార్ట్ స్క్రీన్లు
- రెండోవిడతలో 707 పాఠశాలలకు..
- ఇప్పటికే మొదటి విడతలో అమర్చిన తెరలు, టీవీలు
- ఆండ్రాయిడ్ బాక్స్, ఏపీ ఫైబర్‌నెట్ ద్వారా డిజిటల్ పాఠశాలు



చిలకలూరిపేట మండలం బొప్పూడి ఉన్నత పాఠశాలలో స్మార్ట్ టీవీపై ఉన్న ప్రశ్నపత్రాన్ని చూసి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సాక్షి, నరసరావుపేట: ఒకప్పుడు కార్పొరేట్ పాఠశాలలకే పరిమితమైన డిజిటల్ విద్య ఇప్పుడు మన ఊరిలోని సర్కారు బడిలో పేదింటి పిల్లలకూ అందుబాటులోకి వచ్చింది. పాఠశాల స్థాయి నుంచే అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యను ఏపీ ప్రభుత్వం అందిస్తోంది. మన బడి నాడు–నేడు ద్వారా ఇప్పటికే పాఠశాలల రూపురేఖలను మార్చిన ప్రభుత్వం బోధనా తీరునూ సమూలంగా మార్చింది. స్మార్ట్ తెరల ద్వారా పాఠ్యాంశాల బోధనకు శ్రీకారం చుట్టింది. జిల్లా వ్యాప్తంగా మనబడి నాడు – నేడు తొలి విడతలో అభివృద్ధి చేసిన 446 పాఠశాలల్లో 1,428 ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ స్క్రీన్లు, 485 స్మార్ట్ టీవీలు సమకూర్చింది. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి 60 మంది విద్యార్థులకు 65 అంగుళాల సైజ్‌గల ఒక స్మార్ట్ టీవీ, 6 నుంచి 10 తరగతులకు సెక్షన్‌కు ఒకటి చొప్పున ఐఎఫ్‌పీ స్క్రీన్ ఏర్పాటు చేసింది. ఈ పాఠశాలల్లో ఏపీ ఫైబర్ నెట్ 4జీ ఇంటర్నెట్ సర్వీస్ కేబుల్ సౌకర్యం కల్పించింది. ప్రస్తుతం స్మార్ట్ బోధన దిగ్విజయంగా సాగుతోంది.

ఐఎఫ్‌పీ ప్రయోజనాలు ఇవీ..

ఐఎఫ్‌పీని బ్లాక్ బోర్డు, వైట్ బోర్డులా కూడా వాడుకోవచ్చు. ఈ బోర్డుపై రాసిన నోట్స్‌ను సేవ్ చేయవచ్చు. ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా దీనిని కంప్యూటర్ మాదిరిగా వినియోగించుకునే వీలూ ఉంటుంది. అలాగే ఫోన్ లేదా ట్యాబ్‌లో ఉన్న మెటీరియల్‌నూ స్క్రీన్‌పై చూపించే అవకాశముంటుంది. ప్రస్తుతం జరుగుతున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్–2 పరీక్షల ప్రశ్నపత్రాలు ఆన్‌లైన్ ద్వారా స్క్రీన్లపై ప్రదర్శించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

మరో నెలలో రెండో విడత స్క్రీన్ల అమరిక

రెండో విడత మనబడి నాడు–నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లోనూ స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో 707 ప్రభుత్వ పాఠశాలల్లో 1,444 ఐఎఫ్‌పీ స్క్రీన్లు, 779 స్మార్టు టీవీలు ఏర్పాటు చేయనున్నారు. దీనికోసం విద్యుదీకరణ, ఎర్తింగ్, ఆండ్రాయిడ్ బాక్స్, ల్యాండ్ కేబుల్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరో నెలరోజుల్లో స్మార్ట్ తెరలు తరగతి గదిలో అందుబాటులోకి రానున్నాయి. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీలు ఎలా ఉపయోగించాలనే విషయమై ఉపాధ్యాయులకు అధికారులు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ స్మార్ట్ తెరలకు ఆండ్రాయిడ్ బాక్స్‌ల ద్వారా బైజూస్ కంటెంట్ ఆఫ్‌లైన్‌లో బోధించే అవకాశం కూడా ఉంది.

జిల్లాకు మంజూరైన స్క్రీన్లు, స్మార్ట్ టీవీలు ఇలా..

	మొదటి విడత	రెండో విడత	మొత్తం
పాఠశాలల సంఖ్య	446	707	1,153
ఐఎఫ్‌పీ స్క్రీన్లు	1,428	1,444	2,872
స్మార్ట్ టీవీలు	485	779	1,264

పఠనాసక్తి పెరుగుతుంది



సర్కారు బడుల్లో డిజిటల్ విప్లవం పరుగులు పెడుతోంది. ఇప్పటికే తొలి విడతలో ఏర్పాటుచేసిన అన్ని స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా పాఠ్యాంశాల బోధన విజయవంతంగా సాగుతోంది. దీనివల్ల విద్యార్థుల్లో పఠనాసక్తి పెరుగుతోంది.

– ఎస్.పూర్ణ చంద్రరావు, బైజూస్ జిల్లా కో–ఆర్డినేటర్

పాఠాలు బాగా అర్థమవుతున్నాయి



స్మార్ట్ టీవీల ద్వారా బోధించడం వల్ల పాఠాలు బాగా అర్థమవుతున్నాయి. గతంలో బోర్డుపై రాసి తుడిపేయడం వల్ల మళ్లీ టీచర్‌ని అడగాలంటే ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు మళ్లీ అడిగినా టీచర్లు సులభంగా స్క్రీన్‌పై చూపించి చెబుతున్నారు.

– మేకం నాగలక్ష్మి, 6వ తరగతి, వెంకటాయపాలెం

బోధన సులభతరం



డిజిటల్ బోధన వల్ల ఉపాధ్యాయుల పని సులువైంది. స్క్రీన్‌పై చూపించి చెప్పడం వల్ల విద్యార్థులు వెంటనే అర్థం చేసుకుంటున్నారు. ఇది గొప్ప విప్లవాత్మక మార్పు.

– ఎం.భద్రయ్య, ఎస్‌ఏ ఉపాధ్యాయుడు, ఫణిదం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శివశంకర్

'జలజీవన్' పనుల్లో ముందుండాలి

అధికారులకు కలెక్టర్ శివశంకర్ ఆదేశం

నరసరావుపేట: జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనుల్లో పల్నాడు జిల్లా ముందుండాలని అధికారులను కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గ్రామీణ నీటిసరఫరా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా జిల్లాలో రెండు విడతలుగా 1,055 పనులు మంజూరయ్యాయని, అందులో 300 పనులు మాత్రమే పురోగతిలో ఉన్నాయని పేర్కొన్నారు. 178 పనులు పూర్తికాగా, 88 పనులు వివిధ దశల్లో ఉన్నాయని, 34 ఇంకా మొదలు కాలేదని వివరించారు. నియోజకవర్గాల వారీగా పనుల పురోగతిని గ్రామీణ నీటిపారుదల శాఖ డీఈలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన 755 పనులను ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి సరైన యాక్షన్ ప్లాన్‌తో పనులు మొదలుపెట్టేలా చూడాలన్నారు. బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసి అవసరమైన చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. సంబంధిత డీఈలు ఎప్పటికప్పుడు సంబధిత అధికారులతో సమీక్షలు నిర్వహించి పనులను పురోగతిలోకి తీసుకురావాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి పారుదల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ సురేష్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

తొలగించిన ఓట్లపై పారదర్శకంగా పునర్విచారణ

గుంటూరు కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలో తొలగించిన ఓట్లకు సంబంధించి జరుగుతున్న రీవెరిఫికేషన్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వస్తున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారి ముఖేష్ కుమార్ మీనా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్ సుజాత, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల నమోదు, పునర్విచారణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని అధికారులను హెచ్చరించారు. వివిధ రాజకీయ పార్టీల అభ్యంతరాలపై సమీక్ష నిర్వహిస్తున్నామని వివరించారు. జనవరి 6, 2022 నుంచి జిల్లాలో వివిధ విభాగాల్లో తొలగించిన 1,14,592 ఓట్ల రీవెరిఫికేషన్ పూర్తి చేశామని చెప్పారు. వీటిలో 1,14,293 ఓట్ల తొలగింపు నిర్ణయం సరైనవేనని తేలిందని చెప్పారు. 299 ఓట్లు మాత్రం తప్పుగా తొలగించినట్టు గుర్తించి వాటిని తిరిగి జాబితాలో చేర్చామని వెల్లడించారు.

న్యూస్‌రీల్

94.52 శాతం పింఛన్ల పంపిణీ



నరసరావుపేట: జిల్లాలో సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ ముమ్మరంగా సాగుతోంది. మంగళవారం సాయంత్రానికి 28 మండలాల్లో 94.53 శాతం మందికి పింఛన్లు పంపిణీ పూర్తయింది. జిల్లాలోని 2,82,179 మందికి పింఛన్ సొమ్ము రూ.78,35,59,500 మంజూరు కాగా, 2,66,766 మందికి రూ.74,06,43,500 సొమ్ము అందజేసినట్లు డీఆర్డీఏ పీడీ బాలూనాయక్ వెల్లడించారు.

ఐటీఐ కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్, తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రావి చిన్నవెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. 9,10 తేదీలలో ఆయా కళాశాలల్లో కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. వివరాలకు తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

108 అంబులెన్సులో ఉద్యోగాలు

గుంటూరు మెడికల్ : అరబిందో ఈఎంఎస్ 108 అంబులెన్సులో (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్)గా పనిచేయుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 108 జిల్లా మేనేజర్ జి.నాగదీప్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఎస్సీ బయాలజీ, బీజెడ్ సీఎస్ఎం, బీఎస్సీ నర్సింగ్, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, బీ ఫార్మసీ చదివి, 35 సంవత్సరాల లోపు వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. ప్రత్తిపాడు, తెనాలి, మంగళగిరి, వట్టిచెరుకూరు, కొల్లిపర మండలాల్లో అభ్యర్థులు పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అర్హత ఉన్న వారు తమ దరఖాస్తులను ఈనెల 7వ తేదీలోపు గుంటూరు.రిక్రూట్‌మెంట్.ఏఈఎంఎస్– జీమెయిల్‌కు పంపాలన్నారు. వివరాలకు గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని 108 కార్యాలయంలో, 9121892889 నంబరులో సంప్రదించాలన్నారు.

యార్డుకు 39,041 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 39,041 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 37,152 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 25,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.13,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 23,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 11,443 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

ఏరియా వైద్యశాలకు ఎన్ఆర్‌సీ సెంటర్ ఏర్పాటు

డాక్టర్ బీవీ రంగారావు వెల్లడి

నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట 200 పడకల ఏరియా వైద్యశాలలో పది బెడ్లతో న్యూట్రిషన్ రిహాబిలిటేషన్ సెంటర్(ఎన్ఆర్‌సీ) ఏర్పాటుకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీచేసిందని జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ రంగారావు మంగళవారం సాయంత్రం వెల్లడించారు. పోషకాహార లోపం, బుద్ధి మాంద్యం కలిగిన అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలను ఈ న్యూట్రిషన్ సెంటర్‌లో చేర్చుకొని వారికి కావాల్సిన బలమైన ఆహార పదార్థాలతోపాటు మానసిక ఉల్లాసం కోసం ఆటలు కూడా ఆడిస్తారన్నారు. వీరి పోషణ కోసం ఏడాదికి రూ.2 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. దీంతో పాటు కావాల్సిన డాక్టర్లు, సిబ్బందిని ఏర్పాటు చేస్తుందన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.2,800, గరిష్ట ధర రూ.4,500, మోడల్ ధర రూ.3,500 వరకు పలికింది.

కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

- గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి
- 'మీట్ ది కమిషనర్' కార్యక్రమానికి శ్రీకారం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వేగవంతం, కాంట్రాక్టర్ల సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి శుక్రవారం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు కాంట్రాక్టర్లతో మీట్ ది కమిషనర్ కార్యక్రమం చేపడుతున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కమిషనర్ చాంబర్‌లో నగరంలోని కాంట్రాక్టర్లు తాము చేస్తున్న అభివృద్ధి పనుల్లో ఎదురవుతున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత నగరంలో వర్క్ ఆర్డర్ పొంది, జరుగుతున్న పనుల పురోగతిపై కమిషనర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల నాణ్యతా ప్రమాణాల్లో రాజీ లేకుండా నగరాభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు. మీట్ ది కమిషనర్ కార్యక్రమానికి ప్రతి శుక్రవారం ఉదయం ప్రత్యేక సమయం కేటాయించనున్నట్టు వివరించారు. పనులు పూర్తవగానే బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.



కాంట్రాక్టర్లతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

పిడుగుపాటుకు ఇద్దరు మృత్యువాత

ఒకరికి తీవ్రగాయాలు



మృతులు అమీర్, ఆరోగ్యం

చిలకలూరిపేటటౌన్: పగలంతా ఉక్కపోతగా ఎండకాసింది.. సాయంత్రం ఒక్కసారిగా వర్షం కురిసింది. తమ వ్యక్తిగత పనులపై వాహనాలపై వెళ్తున్న సుమారు 20 మంది ఓ చెట్టు కిందకు చేరారు. ఆ చెట్టుపై హఠాత్తుగా పిడుగు పడింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటన చిలకలూరిపేట మండలం కావూరు సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నరసరావుపేట మండలం రావిపాడుకు చెందిన కూలి ఆలూరి ఆరోగ్యం(58) తన చెల్లెలు రాయపూడి రాణితో కలిసి బంగారం కొనుగోలుకు టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై వచ్చి తిరిగి సొంతూరుకు పయనమయ్యాడు. నరసరావుపేట పట్టణం వెంగళ్‌రెడ్డి నగర్ వాసి షేక్ అమీర్(35) చిలకలూరిపేట పట్టణంలోని సుభాని నగర్‌లో తన మేస్త్రీ ఇంట్లో ఓ ఫంక్షన్ నిమిత్తం వచ్చి తిరిగి బైక్‌పై బయలుదేరాడు. ఫైనాన్స్ తాలూకు బకాయిల వసూళ్ల నిమిత్తం పొన్నూరుకు చెందిన చిన్నబ్బాయ్ నరసరావుపేటకు వెళ్తున్నాడు. వీరంతా మార్గమధ్యలో వర్షం కురవడంతో కావూరు ప్రారంభంలోని కుప్పగంజి వాగు సమీపంలోని బటర్‌ఫ్లై వెంచర్స్ వద్ద చింత చెట్టు కిందకు చేరారు. వీరితోపాటు మరో 15 మందికిపైగా వాహనచోదకులు ఆ చెట్టు కిందే నిలుచుకున్నారు. ఇంతలో హఠాత్తుగా చింతచెట్టుపై పిడుగు పడింది. ఫలితంగా అమీర్, ఆరోగ్యం అక్కడికక్కడే మృతి చెందారు. వారి పక్కనే నిలుచున్న ఫైనాన్స్ కంపెనీ గుమాస్తా చిన్నబ్బాయ్ చేయి పూర్తిగా కాలిపోయింది. అతను షాక్‌కు గురయ్యాడు. అక్కడే నిలుచున్న వారంతా ఊహించని ఈ పరిణామానికి నిర్ఘాంతపోయారు. వెంటనే తేరుకుని 108 వాహనానికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న రూరల్ పోలీసులు మృతులను, గాయపడ్డ వారిని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేడు రాజుపాలెంలో స్పందన

నరసరావుపేట: జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమం బుధవారం సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రాజుపాలెం, సత్తెనపల్లి, నకరికల్లు మండలాల పరిధిలో ప్రజలు తమ సమస్యలు తెలియచేయవచ్చని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి జిల్లా అధికారులు, మండలాధికారులు హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

గుండెలు గెలిసేవన్న

ఇది కదా గ్రామ స్వరాజ్యం
- సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటికే పౌరసేవలు
- మహత్తర సేవా యజ్ఞానికి నాలుగేళ్లు
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కొనియాడుతున్న ప్రజలు

కాళ్లకు బలపం కట్టుకుని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పని లేదు.. పనులు మానుకుని పస్తుల మూట కట్టుకుని అధికారుల కోసం నిరీక్షించాల్సిన అవసరం అంతకన్నా లేదు.. ఇంటికొచ్చే వలంటీరు వద్ద దరఖాస్తు చేస్తే చాలు. ఏ ధ్రువపత్రం కావాలన్నా రోజుల వ్యవధిలోనే ముంగిటకే వచ్చేస్తోంది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 536 సేవలు ఒకే చోట లభిస్తున్నాయి. దీనికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థే కారణం.



సచివాలయంలో ధ్రువపత్రాల జారీ నిమిత్తం ఐరిస్ తీస్తున్న ఉద్యోగిని (ఫైల్)

బాపట్ల అర్బన్: గ్రామ/వార్డు సచివాలయాల సేవలు దిగ్విజయంగా అందుతున్నాయి. ఫలితంగా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల జిల్లాలో 477 గ్రామ/వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిల్లో 4,224 మంది పనిచేస్తున్నారు. గ్రామ/వార్డు సచివాలయాల వ్యవస్థ ప్రవేశపెట్టి అక్టోబర్ 2 నాటికి నాలుగేళ్లు పూర్తయింది. ఈ నాలుగేళ్లలో జిల్లాలో 33.73 లక్షల వినతులు నమోదయ్యాయి. వీటిల్లో 90శాతం పరిష్కారమయ్యాయి. దీంతో సర్వత్రా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యమా అని నెలల తరబడి మండల కార్యాలయాల చుట్టూ తిరిగే బాధలు తప్పాయని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో నాలుగో స్థానంలో జిల్లా

సచివాలయ వ్యవస్థ ఆవిర్భవించిన అనంతరం 2022 నవంబర్ 26 నాటికి తొలి దశలో చేసిన సర్వేలో 4.70 లక్షల సేవలను అందించి అప్పట్లో రాష్ట్రంలోనే జిల్లా 4వ స్థానంలో నిలిచింది. ఈ సేవల్లో దాదాపు 90 శాతం నిర్ణీత కాలంలో అందించినవే. తాజాగా ఆదివారం నాటికి నాలుగేళ్లలో వివిధ శాఖలకు సంబంధించి 33,77,057 వినతులు వచ్చాయి. వీటిలో 60 శాతం రెవెన్యూ శాఖకు సంబంధించినవే.. వీటిల్లో అధికంగా ఇటీవల నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో నమోదైనవే ఉన్నాయి. వీటిలో 90 శాతం మేర నిర్దేశించిన సమయంలోనే పరిష్కారమయ్యాయి.

ప్రత్యేకాధికారుల నిరంతర పర్యవేక్షణ

గ్రామ/వార్డు సచివాలయాలపై జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షణ ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లా అధికారులు నిరంతరం సచివాలయాలను సందర్శించి అందిస్తున్న సేవలపై ఆరా తీస్తున్నారు. ఒక్కో అధికారి ప్రతి వారం కనీసం నాలుగు సచివాలయాలను తనిఖీ చేస్తున్నారు. ప్రతి మండలాని కి ఒక జిల్లా అధికారిని ప్రత్యేక అధికారిగా గతంలో కలెక్టర్ నియమించారు. వీరు వారానికి కనీసం రెండు సచివాలయాలను తనిఖీ చేస్తున్నారు. సిబ్బందిపై నిఘా ఉంచుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ సత్ఫలితాలనిస్తోంది. సేవలు వేగంగా ప్రజలకు అందేలా దోహదపడుతోంది.

సేవ మరువలేం



సచివాలయం వద్ద పాస్ పుస్తకాలకు దరఖాస్తు చేసుకున్నాను. టెక్నికల్ సమస్యలన్నింటినీ అధిగమించి మా భూమి మా పేరు మీద సచివాలయ సిబ్బంది మ్యుటేషన్ చేయించారు. ఇంటికి తెచ్చి పాసుపుస్తకాలు, 1బీ అడంగల్లు అందజేశారు. ఈ సేవలు మరువలేం. జగనన్న మా హృదయాలు గెలిచారు.

– గర్నేపూడి లూథియా, ఈతేరు, బాపట్ల మండలం

గతానికంటే భిన్నంగా



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని సచివాలయ వ్యవస్థ ఏర్పాటైన తర్వాత సమస్యలు వేగంగా పరిష్కారమవుతున్నాయి. గతంలో ఏదైనా పని కావాలంటే మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. ఇంటి దగ్గరలోనే సచివాలయంలో సేవలన్నీ అందుతున్నాయి. వలంటీరే ఇంటికొచ్చి దరఖాస్తు తీసుకుని రోజుల వ్యవధిలోని పని చేసి పెడుతున్నారు. నాకు ఇంటిస్థల పట్టా వచ్చింది. ప్రభుత్వ సాయంతో ఇంటి నిర్మాణం పూర్తయింది. వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా డబ్బులు వస్తున్నాయి. చాలా సంతోషంగా ఉంది.

– చేవూరి కోటేశ్వరమ్మ, చుండూరు పల్లి గ్రామం, బాపట్ల మండలం

ఇంటికే పాసు పుస్తకాలు



మాకు భూముల పంపకాలు జరిగినా పాస్ పుస్తకాలు రాలేదు. పాత పాస్ పుస్తకాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. 1బీలు తప్పుల తడకగా ఉండేది. గతంలో ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా పని కాలేదు. గ్రామ సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత వలంటీరుకు సమస్య చెప్పాను. సచివాలయ ఉద్యోగులు సర్వే చేయించి, మా భూమి మొత్తం ఆన్‌లైన్‌లో ఎక్కించి, ఇంటికే పాస్ పుస్తకాలు అందించారు. సచివాలయ వ్యవస్థతో ఎంతో మేలు చేకూరింది.

– పైణం చంద్రశేఖరరావు, పూండ్ల సచివాలయం, బాపట్ల మండలం

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



థాంక్స్ సీఎం సార్ అనే ప్లకార్డులతో ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవ రాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడి 4 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేసి థ్యాంక్స్ సీఎం సార్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ అధ్యక్షత వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ...గాంధీజీ గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేదవాడికి సేవలు అందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారని అన్నారు. నేడు సచివాలయ వ్యవస్థ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, వివిధ రాష్ట్రాలు ఈ సచివాలయ వ్యవస్థను వారి రాష్ట్రాల్లో ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కరోనా సమయంలో కూడా సచివాలయ ఉద్యోగస్తుల కృషి మరవలేనిదని వారు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్రుని రామిరెడ్డి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, గొట్టిముక్కల పవన్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగ సంఘ నాయకులు ప్రభాకర్, మహేష్, అశోక్, కొమ్ము కల్యాణ్, రాజశేఖర్, కొమ్మా మహేష్, అయ్యప్పరెడ్డి, వెంకటరెడ్డి, మల్లేశ్వరి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా అందరికీ వైద్య పరీక్షలు

ఎమ్మెల్సీ పోతుల సునీత



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ సునీత

వేటపాలెం: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామాల్లో ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపేట సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష క్యాంపును ఎమ్మెల్సీ పరిశీలించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులను వైద్య పరీక్షల గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేద వారికి ఉచిత వైద్యంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం లక్ష్యంతో కార్యక్రమానికి రూపకల్పన చేశారని తెలిపారు. ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది వెళ్లి ఏడు రకాల వైద్య పరీక్షలు అందిస్తారని, కార్యక్రమం 45 రోజుల పాటు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బండ్ల తిరుమలాదేవి, డాక్టర్ బాలరాజు, మాజీ సర్పంచ్ చుండూరి వాసు, మార్పు గ్రెగోరీ, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భవ్యశ్రీ కుటుంబానికి అండగా ఉంటాం

నెహ్రూనగర్ : చిత్తూరు జిల్లాలో అత్యాచారానికి గురై హత్యగావించబడిన మైనర్ బాలిక భవ్యశ్రీ కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తెలియజేశారు. భవ్యశ్రీని హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి హిందూ కాలేజీ సెంటర్‌లోని పూలే విగ్రహం నుంచి లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఏసురత్నం మాట్లాడుతూ మైనర్ బాలికను అత్యంత పాశవికంగా హత్య చేయడం బాధాకరమన్నారు. భవ్యశ్రీ కుటుంబానికి తన వంతు రూ.లక్ష సాయం అందజేస్తానని ప్రకటించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు తన్నీరు ఆంజనేయులు మాట్లాడుతూ భవ్యశ్రీ హత్య విషయంలో పలు అనుమానాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వల్లెపు ముసలయ్య, మిరియాల సాంబయ్య, తురకా నారాయణ, నరసింహారావు, రామారావు, కార్పొరేటర్ వేముల జ్యోతి పద్మజ ఇతర నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

- ప్రజా ఆరోగ్యాన్ని కాపాడటమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- నందిగామలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



నందిగామలో వైద్య కిట్ పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వం బాధ్యతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆయన ప్రారంభించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ రాష్ట్రంలోని 1.60 కోట్ల కుటుంబాలకు వైద్యాన్ని ఉచితంగా అందించేందుకు ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలందరికీ వైద్య ఆరోగ్య సేవలు అందిస్తారన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరంలో మధుమేహం, బీపీ, హిమోగ్లోబిన్, డెంగ్యూ, మలేరియా, శరీర ఉష్ణోగ్రత తదితర పరీక్షలు నిర్వహిస్తారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమల్లో సిబ్బంది ఎటువంటి నిర్లిప్తత లేకుండా వ్యవహరించాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వారికి అవసరమైన వైద్య సహాయం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమన్నారు. రాష్ట్రంలో 100 శాతం ప్రతి ఒక్కరికి వైద్యం అందించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం జరిగిందని, పేదలకు మెరుగైన వైద్య సేవలు కార్పొరేట్ స్థాయి వైద్యం చేరువ చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం పని చేస్తుందన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ యుఎస్ఎల్ కవిత, డాక్టర్ ఎస్‌వీఎన్ సాయితేజరెడ్డి, స్పెషలిస్టులు డాక్టర్ నాగబాబు, డాక్టర్ రవిశంకర్, ఆప్తమాలజిస్ట్ కలిబాబులు 436 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. 11 మందిని మరిన్ని పరీక్షల కోసం ఆరోగ్యశ్రీ పథకంలో ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేశారు. అంతేగాక కంటి వెలుగులో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్లజోళ్ల పంపిణీ చేసేందుకు సిఫార్సు చేశారు. రోగులకు వారి రిపోర్టుతో కూడిన ఫోల్డర్, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ షేక్ ఎలవర్తి పాటి జైబూన్ బీ, గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు రెంటపాళ్ల ప్రియదర్శిని, సయ్యద్ షీమా, వైఎస్సార్ సీపీ వైద్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు రాయపాటి పురుషోత్తమరావు, కట్టా సాంబయ్య, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, ఎస్సీ సెల్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్, మండల నాయకుడు ఇసా, స్థానిక నాయకులు ఆళ్ల జగ్గయ్య, కొల్లా నరేష్, జంగాల సంపత్‌కుమార్, పాట్లూరి శ్రీనివాసరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, ఎంపీడీవో జీవీ సత్య నారాయణ, తహసీల్దార్ ఎస్ సురేష్, సీడీపీఓ శ్రీలత, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల విజేతలు వీరే..

నరసరావుపేట: పల్నాడు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రకళ పోటీలకు చెందిన విజేతల వివరాలను కేంద్రం కన్వీనర్ షేక్ మస్తాన్‌వలి, నిర్వాహకులు కట్టా కోటేశ్వరరావు మంగళవారం విడుదల చేశారు. పోటీలకు మొత్తం 1300 మంది రిజిస్టర్ చేసుకోగా 1100 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. ప్రముఖ ఆర్టిస్టులు జింక రామారావు(సత్తెనపల్లి), పి.ప్రసాద్(వినుకొండ), అష్రఫ్ అలీ (పల్నాడు కళాక్షేత్రం కోశాధికారి), స్థానిక ఉపాధ్యాయులు పి.తిరుమల లక్ష్మి, వేదాంతం రాంబాబు, ధారల నాగేశ్వరచారి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని తెలిపారు.

విజేతల వివరాలు

మూడు, నాలుగు, ఐదు తరగతులకు చెందిన సబ్ జూనియర్స్ విభాగంలో వి.శరణ్యసాయి, కె.వేద, కె.మనస్విని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు పొందారు. 6, 7,8 తరగతులకు చెందిన జూనియర్ విభాగంలో దీక్ష కేసాని, డి.యశ్వంత్, బి.పావనిదుర్గ ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానం పొందారు. 9,10 తరగతులకు చెందిన సీనియర్ విభాగంలో ఎం.శ్యామ్‌కుమార్, జి.నరేంద్ర, బి.క్రినో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. ప్రతి విభాగంలోనూ కన్సోలేషన్ బహుమతులను కూడా ప్రకటించారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు విజ్ఞాన కేంద్రం తరఫున ఇవ్వబోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈనెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ ఆవరణలో జరిగే పల్నాడు బాలోత్సవంలో విజేతలందరికీ బహుమతి ప్రదానోత్సవం చేస్తామని తెలిపారు.

ఐటీఐలో చేరేవారు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్లఅర్బన్: 2023 -24వ సంవత్సరానికి జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో నాల్గో విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన ఖాళీలను పూర్తి చేసేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని నిజాంపట్నం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎస్.సుధాకర బాబు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ పాసై ఆపై చదువులు చదివిన ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈనెల 7వ తేదీ రాత్రి 11.59 గంటల్లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ ప్రింటు కాపీని డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. డౌన్‌లోడు చేసుకున్న దరఖాస్తు కాపీకి అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ (2 సెట్స్), కలర్ పాస్ పోర్ట్ సైజు ఫొటోలు మూడు తీసుకుని ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం 12 లోపు ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. జిల్లాలోని ఒకటి కంటే ఎక్కువ ఐటీఐలను కూడా ఎంపిక చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ ఐటీఐలలో కౌన్సెలింగ్ ఈనెల 9వ తేదీన జరుగుతోందన్నారు. ప్రైవేట్ ఐటీఐలలో ఈనెల 10వ తేదీన కౌన్సెలింగ్ జరుగుతోందని వెల్లడించారు. పూర్తి వివరాలకు మొబైల్ నెంబర్ 9849479524లో సంప్రదించాలన్నారు. గవర్నమెంట్ ఐటీఐ నిజాంపట్నం ఆఫీసు పనివేళల్లో సంప్రదించవచ్చన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

జిల్లా అభివృద్ధి అధికారి యార్ల మహాలక్ష్మి



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అభివృద్ధి అధికారి మహాలక్ష్మి, ఎంపీపీ చౌడేశ్వరి

మల్లవరం(రెంటచింతల): తరగతి గదులలో బోధించే విద్యతోనే అభివృద్ధి సాధ్యమని జిల్లా అభివృద్ధి అధికారి యార్ల మహాలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని మల్లవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె ఎంపీపీ దాసరి చౌడేశ్వరితో కలిసి సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా...వారు చెప్పే పాఠాలు అర్థమౌతున్నాయా...అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించి దేశ భవిష్యత్ మీ చేతులలోనే ఉందని విలువలు, క్రమశిక్షణ ఎంతో ముఖ్యమన్నారు. విద్య అనేది బాలల హక్కు అని...పిల్లలు క్రమశిక్షణ కలిగిన విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ప్రతి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. విద్య ద్వారా ప్రతి కుటుంబం తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందని చదువుకోవడానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వడితే సోమ్లీబాయి, హెచ్ఎం షేక్ ఫకీర్ అహ్మద్, ఈవోపీఆర్డీ జి.అనంత కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు వడితే బుడ సైదానాయక్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వేమూరు: 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ పి బాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఎస్సీ లైఫ్ సైన్సు, బీ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్, డీఎంల్టీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 6వ తేదీలోపు బాపట్ల జిల్లా చీరాల ఏరియా ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

యూపీఎస్సీ పరీక్ష క్వాలిఫై కాలేదని..

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన రాజశేఖర్

మార్టూరు: కష్టపడి రేయింబవళ్లు యూపీఎస్సీ పరీక్షకు సన్నద్ధం అయ్యాడు. కాని పరీక్షలో అనుకున్నది సాధించలేదన్న మనస్తాపంతో ఓ యువకుడు అర్ధంతరంగా తనువు చాలించాడు. ఈ ఘటన మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కట్టా శ్రీనివాసరావు కుమారుడు కట్టా రాజశేఖర్ (23) ఇంజినీరింగ్ పూర్తిచేసి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నాడు. కాని పరీక్షలో క్వాలిఫై కాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. మంగళవారం ఉదయం రాజశేఖర్ తన గది నుంచి బయటకు రాకపోవడంతో పరిశీలించిన కుటుంబ సభ్యులు గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉండటాన్ని గమనించి కిందకు దించారు. అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా దసరా ఉత్సవ ఏర్పాట్లు

తుది దశకు మహా మండపం పెయింటింగ్ పనులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే దసరా ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురానికి పెయింటింగ్ పనులు తుది దశకు చేరుకోగా, ఆలయ ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. మరో మూడు నాలుగు రోజుల్లో ఎలక్ట్రికల్ పనులు తుది దశకు చేరుకుంటాయని ఆలయ అధికారులు చెబుతున్నారు. ఇక ఉత్సవాలలో అత్యంత కీలకమైన పనులలో ప్రధానమైన క్యూలైన్ పనులు జరుగుతున్నాయి. ఘాట్‌రోడ్డులోని మొదటి మలుపు నుంచి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి విగ్రహం వరకు క్యూలైన్ల పనులు పూర్తయ్యాయి. సర్వదర్శనంతో పాటు రూ. 100, రూ.300, రూ.500 టికెట్లు కోసం నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇక కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి నుంచి క్యూలైన్ పనులు చేపట్టగా, దుర్గాఘాట్ వద్ద పనులు ఇంకా చేపట్టాల్సి ఉంది. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు దుర్గాఘాట్ ఎదుట కొండ రాళ్లు, కొండ చరియలు విరిగి పడిన సంగతి తెలిసిందే. భవిష్యత్తులో కొండ రాళ్లు జారి పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కొండ రాళ్లను మరి కొన్నింటిని తొలగించారు. అయితే ఆ ప్రాంతంలో క్యూలైన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

కేశఖండనశాల, ప్రసాదాల విక్రయ కౌంటర్లు

సీతమ్మ వారి పాదాల వద్ద భక్తులు తలనీలాలు సమర్పించేందుకు కేశఖండనశాల షెడ్డు నిర్మాణం జరుగుతోంది. మరో వైపున కనకదుర్గనగర్‌లో ప్రసాదాల విక్రయ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం 10 కౌంటర్లు ఏర్పాటు చేసింది. మరో వైపున కనకదుర్గనగర్ నుంచి మహా మండపం వరకు ఏర్పాటు చేసిన పెర్గోలా తొలగింపు పనులు తుది దశకు చేరుకున్నాయి.

77 మంది అభ్యర్థుల పత్రాలు పరిశీలన

పెడన: సమగ్ర శిక్ష ఐఈఆర్‌టీలో మానసిక వైకల్యం(ఎంఆర్) కేటగిరీకి సంబంధించిన 96 మంది అభ్యర్థులకుగాను 77 మంది ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మంగళవారం మచిలీపట్నం డీఈఓ కార్యాలయంలో సమావేశం హాలులో జరిగిన ధ్రువీకరణ పత్రాల పరిశీలనను సమగ్ర శిక్ష ఏపీసీ ఎం. ఫణిధూర్జటి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ఎంఆర్ కేటగిరీలో 96 మందికిగాను 77 మంది హాజరయ్యారని మిగిలిన వారంతా బుధవారం డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన సూచించారు. హెచ్ఐ, వీఐ కేటగిరికి సంబంధించిన 77 మంది అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మచిలీపట్నం డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరు కావాలని ఏపీసీ పేర్కొన్నారు.

ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో టెస్ట్ క్రికెట్ పోటీలు ప్రారంభం

కృష్ణా, ప్రకాశం జిల్లాల జట్లు



109 పరుగులు సాధించిన పిట్టల దుర్గా బాలాజి

నరసరావుపేట: స్థానిక ఎస్‌కేఆర్‌బీఆర్ కళాశాలలోని ఏసీఏ క్రికెట్ గ్రౌండ్‌లో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సెంట్రల్ జోన్ అంతర్ జిల్లాల 23ఏళ్లలోపు బాలుర మూడు రోజుల టెస్ట్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. కృష్ణా, ప్రకాశం జిల్లా జట్లు మధ్య జరిగిన మొదటి మ్యాచ్‌లో టాస్ గెలిచిన ప్రకాశం జిల్లా జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 70..4 ఓవర్లలో 307 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ప్రకాశం జిల్లా జట్టులోని పిట్టల దుర్గా బాలాజీ 109పరుగులు చేయగా, గుత్తా రోహిత్ 90 పరుగులు చేసి అవుట్ అయ్యారు. కృష్ణా జట్టులోని సుశాంత్ నాలుగు వికెట్లు, మానస్ రెండు వికెట్లు సాధించారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కృష్ణా జిల్లా జట్టు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ నష్టానికి 12 పరుగులు చేశారు. బుధవారం రెండవ రోజు ఆట కొనసాగుతుందని గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు వెల్లడించారు.

రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మూడో స్థానం



రాష్ట్రస్థాయిలో పోటీల్లో బాలికల జట్టు అభినందిస్తున్న దృశ్యం

శావల్యాపురం: రాష్ట్రస్థాయిలో జరిగిన 8వ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సబ్‌జూనియర్ విభాగంలో శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విదార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మూడో స్థానం సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.వి జయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ గత నెల 30 నుంచి ఈనెల 2వ తేదీ వరకు నంద్యాల జిల్లా మహానందిలో జరిగిన పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టులో 10 మంది క్రీడాకారులు పాల్గొనగా అందులో శావల్యాపురం హైస్కూలు విద్యార్థినులు ఏడుగురు పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. పోటీల్లో పాఠశాల ఉపాధ్యాయులు ఎంఎస్‌కె అబ్దుల్లా, రవి, శ్రీనివాసరావు, ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ కార్యదర్శి ఈ.శివశంకర్, అధ్యక్షులు ఆనందప్రభాకర్ పాల్గొన్నట్లు చెప్పారు.

జాతీయ స్థాయి పోటీలకు వేముల దివ్య ఎంపిక



జాతీయ స్థాయికి ఎంపికైన దివ్య

శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న వేముల దివ్య జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల పీడీ, ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల బాల్‌బ్యాడ్మింటన్ కోచ్ రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. జాతీయ పోటీలు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం బిలామ్ గ్రామంలో ఈనెల 15 నుంచి 19 వరకు జరుగుతాయన్నారు. రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో మూడో స్థానం సాధించిన బాలికల జట్టును పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

పాడి రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలి

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: జగనన్న పాలవెల్లువ పథకంలో నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు మంజూరు ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ పథకంలో భాగంగా పాడి రైతుల రోజువారీ ఖర్చుల కోసం స్వల్పకాలిక రుణాల కింద రూ.20 వేలు, పాడి గేదెల కొనుగోలు కోసం దీర్ఘకాలిక రుణాల కింద రూ.లక్ష సహకార బ్యాంకుల ద్వారా అందించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దీనికోసం మొత్తం 4000 మందికి రుణాలిచ్చేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. రుణాల కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. దీనిపై అధికారులు పాడి రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ వివరించారు.

ఫిష్ ఆంధ్రాను ప్రమోట్ చేయాలి...

జిల్లాలో ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా ఉత్పత్తులను పెంచడంతోపాటు వాటి వినియోగాన్ని రెట్టింపు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. దీని కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫిష్ ఆంధ్రాను ప్రమోట్ చేయాలని సూచించారు.